క్లుప్తంగా

విధుల్లోకి వీఓఏలు



వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

కరకగూడెం: గత 45 రోజులుగా తమ హక్కుల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలు ఎట్టకేలకు శుక్రవారం నుంచి విధుల్లోకి చేరారు. ఈ మేరకు వారు స్థానిక ఐకేపీ కార్యలయంలో ఏపీఎం త్రిగుణకు ఉద్యోగాల్లోకి చేరుతున్నట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల ప్రభుత్వంతో చర్చలు జరిపి తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు వెంకన్న, రమాదేవి, సామ్రాజ్యం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్, యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మహిళలకు ఉచిత కంప్యూటర్, యోగా ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్2 టెక్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 25 వరకు ఈ శిక్షణ శిబిరంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశంను ఆసక్తి ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురంలోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. కాగా ఆలయ హుండీ ఆదాయం స్వల్పంగా తగ్గింది. ఆలయంలోగల హుండీల ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 27వ తేది నుంచి ఈనెల 2 వరకు రూ.98 వేల 641లు ఆదాయం రాగా, గడిచిన రెండు నెలల్లో రూ.650 వరకు ఆదాయం తగ్గినట్లు దేవదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పీ బెయిల్ సింగ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొడియం సత్యావతి, ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి, ఆలయ మేనేజర్ బి.సూర్య ప్రకాశ్‌రావు, కమిటీ సభ్యులు లోకం అశ్విని కుమార్, నాగమహేశ్వరరావు, తెల్లం రాము, బిర్రం వెంకటేశ్వర్లు, లోకం సాంబశివరావు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ

కరకగూడెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేమని కరకగూడెం ఎంపీపీ రేగా కాళిక అన్నారు. ఈ మేరకు ఎంపీపీ శుక్రవారం కరకగూడెం మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు, సిబ్బందికి యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లోని చెత్తను ప్రతిరోజు తీసుకెళ్ళ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం గత ప్రభుత్వాల్లో ఎన్నడు చూడలేదన్నారు. పంచాయతీ సెక్రటరీ శ్యాం సుందర్ రెడ్డి, సర్పంచ్ ఊకే రామనాథం, మండల నాయకులు బుడగం రాము, రేగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. తాళ్లగొమ్మూరుకు సమీపంలోని కొల్లుచెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాల్లో కోతలు విధించి పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టి ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు ఉద్యమించాలని కోరారు.

'దశాబ్ది' ఉత్సవం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి జై తెలంగాణ అని నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర అవతరణకు అశువులు బాసిన వీరులకు నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు



దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు వేసిన ముగ్గు



దమ్మపేట: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి తుమ్మల



అన్నపురెడ్డిపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ లలిత



భద్రాచలంఅర్బన్: ఏఎస్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్



భద్రాచలంలో కోర్టు ఆవరణలో..



పినపాక: తహసీల్దార్ కార్యాలయంలో..



బూర్గంపాడు: తహసీల్‌లో..



గుండాల: పోలీస్ స్టేషన్‌లో..



ఆళ్లపల్లిలో..



అశ్వాపురం: తహసీల్దార్ కార్యాలయంలో..



చండ్రుగొండలో..



చర్లలో..



దుమ్ముగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో..



భద్రాచలంటౌన్: ప్రత్యేక అధికారి కార్యాలయంలో..



కరకగూడెంలో..



ములకలపల్లిలో..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తప్పకుండా తీసుకోవాలని సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి భవనంలో శుక్రవారం అశ్వారావుపేట సబ్ యూనిట్ పరిధిలోని వినాయకపురం, గుమ్మడవల్లి, దమ్మపేట, పట్వారీగూడెం పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. అలాగే జ్వర పీడితుల నుంచి రక్త పూతల సేకరణ, వ్యాధులతో బాధపడేవారిని ఆస్పత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు రాందాస్, మధుశిక, మనిదీప్, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చండ్రుగొండ : మండలకేంద్రం చండ్రుగొండ, అయన్నపాలెం గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావుకు వినతిపత్రం అందించారు. తొలుత అయన్నపాలెం, చండ్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు అనేక మార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, దాసరి సీతారాములు, బడుగు సురేష్, బూరుగు రాములు, దాసరి కళ్యాణ్, తలారి పాపమ్మ, కన్నమాల నాగరత్నం పాల్గొన్నారు.

రైతు దినోత్సవం ఏర్పాట్లు పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న రైతు దినోత్సవ ఏర్పాట్లను జెడ్పీటీసీ శ్రీలత, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పరిశీలించారు. మోరంపల్లి బంజర, సారపాక, బూర్గంపాడు రైతువేదికల్లో నిర్వహించనున్న రైతు దినోత్సవ సభాస్థలాలను శుక్రవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్, ఏఓ శంకర్, ఆర్ఐ శంకర్, రైతుబంధు సమితి ప్రతినిధి గాదె నర్సిరెడ్డి పాల్గొన్నారు.

జాబ్ కార్డులివ్వాలి

చర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి జాబ్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కలివేరులో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద పని కోసం దరఖాస్తు చేసుకునే ప్రతీ కుటుంబానికి జాబ్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సమ్మక్క, రుక్మిణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో తహసీల్దార్ పర్యటన



చెన్నాపురంలో తాగునీటి సమస్యను వివరిస్తున్న ఆదివాసీలు

చర్ల: తహసీల్దార్ బి.భరణిబాబు శుక్రవారం మండలంలోని చెన్నాపురం, గోరుకొండ, తిప్పాపురం, ఉయ్యాలమడుగు, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, బత్తినపల్లి గ్రామాల్లో పర్యటించి అక్కడి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ ఆధారిత మంచినీటి పథకం మరమ్మతులకు గురై తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు మంజూరు కావడం లేదని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదంటూ ఇలా పలు సమస్యలను ఆయా గ్రామాల ఆదివాసీలు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కరించబడేలా కృషి చేస్తానంటూ వారికి హామీ ఇచ్చారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పొంగులేటి పరామర్శ



పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో జర్నలిస్టు నెహ్రూ తల్లి మీద గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దాడిని తెలుసుకుని వారి ఇంటికి గురువారం రాత్రి వెళ్ళి బాధితురాలిని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టు కుటుంబాలపై జరుగుతున్న దాడులు సమాజానికి గొడ్డలిపెట్టు లాంటివన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చప్టా దిగువకు చెందిన ఓ వ్యక్తి పై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చప్టా దిగువకు చెందిన రమేష్‌కు చెందిన కారు అద్దాలను సెటిల్మెంట్ సతీష్ అనే వ్యక్తి పగలకొట్టి, తనపై దాడి చేసి బెదిరింపులకు దిగినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో రమేష్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిధులు ఇస్తా.. బోరు వేయించండి



కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

అశ్వారావుపేటరూరల్: తన కోటా కింద నిధులు మంజూరు చేస్తానని, తక్షణమే బోరు పాయింట్ పెట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ కొత్త పేరాయిగూడెం, ఫైర్ కాలనీలో గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య ఉందని, కొన్ని ప్రాంతాల్లో బురదనీరు వస్తుందని ఆయా ప్రాంతాల మహిళలు ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు. దాంతో అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తిను పిలిచి నిధులు మంజూరు చేస్తానని చెప్పి, నెల రోజులు కావస్తున్నా ఇప్పటి దాకా కొత్త బోరు వేయించకపోతే ఎలా అంటూ.. అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అదుపు తప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

బూర్గంపాడు: మండలంలోని సంజీవరెడ్డిపాలెం వద్ద శుక్రవారం ఓ కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. భద్రాచలం వైపు వస్తున్న కారు అదుపుతప్పి పొలాల్లో పల్టీ కొట్టగా కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయనను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫాంలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక విద్యా వనరులకు కేంద్రంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యతతో పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం అందిస్తోందని, అలాగే యూనిఫాంలను మార్పు చేసినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను సకాలంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పి.కృష్ణయ్య, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, సీసీఓ ఎస్‌కె.మహబూబ్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..



ములకలపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

అశ్వాపురం: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జూన్ 2 నుండి 12 వరకు తెలంగాణ ప్రజల ఆకాంక్షల దీక్ష దినంగా జరపాలని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఆర్గనైజర్ కాంపాటి జీవన్, వెంకటేశ్వర్లు, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం నుంచి స్థానిక తహసీల్ వరకు ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం, తహసీల్దార్ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ... పోడు భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీలు, పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమండ్ చేశారు. నాయకులు అమర్లపూడి రాము, తోడెం దుర్గమ్మ, కారం సంధ్య, బండి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు చేసుకుంటున్న సీఎం కేసీఆర్ నాటి ఎన్నికల హామీలు అమలు ఏమైందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్ ప్రశ్నించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణా ప్రజా దీక్షా దివస్ సభను ఉద్దేశించి, ఆయన మాట్లాడారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నివాస స్థలాలు, పెన్షన్లు నీళ్లు, నియామకాలు తదితర హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫమైందని ఆరోపించారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించి, తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, ఎంపీటీసీ నూపా సరోజిని, రాచన్నగూడెం సర్పంచ్ కొర్సా గణపతి, నాయకులు బండారి నాగేంద్రబాబు, నకిరకంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



దమ్మపేటలో..